


ఆత్మరక్షణ కళలపై శిక్షణ పొందుతున్న బాలికలు

వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఫ్రీ
జిల్లావ్యాప్తంగా 32 విద్యాలయాల్లో అడ్మిషన్లు
6 నుంచి ఇంటర్ వరకూ 2,770 ఖాళీలు
దరఖాస్తుకు 11వ తేదీ ఆఖరి గడువు




బుక్కరాయసముద్రం కేజీబీవీ.. విద్యార్థినులకు యోగా శిక్షణ

అమ్మలాంటి బడి

కార్పొరేట్‌కు దీటుగా కేజీబీవీ విద్య

అనంతపురం విద్య, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒక వైపు చదువు, మరో వైపు క్రీడలు. ఇటు యోగా తరగతులు, అటు బాలికలు రాటుదేలేలా ఆత్మరక్షణ విద్యలో మెళకువలు. పాఠ్యపుస్తకాల నుంచి నోట్ పుస్తకాలు, ఫుడ్, బెడ్, యూనిఫాం ఇలా అన్నీ ఉచితంగా అందించే వెసులుబాటు. ఆరోగ్యకర, ఆహ్లాదకర వాతావరణం నడుమ రెసిడెన్షియల్ బోధన. ఇదీ కార్పొరేట్‌కు దీటుగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో అందిస్తున్న విద్య. జిల్లావ్యాప్తంగా 32 కేజీబీవీలున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ క్లాసులు నిర్వహిస్తున్నారు. కేజీబీవీల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. ఈనెల 11వ తేదీ ఆఖరి గడువు ఉంది. జిల్లాలో 6వ తరగతి నుంచి ఇంటర్ సెకెండియర్ వరకూ 2,770 సీట్లు ఉన్నాయి. వాటికి అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

ఈ అర్హతలున్న బాలికలకు పెద్దపీట

కేజీబీవీల్లో బాలికలకు మాత్రమే సీట్లు ఇస్తారు. గతంలో 6 నుంచి 10వ తరగతి వరకూ క్లాసులు నిర్వహించేవారు. కొన్నేళ్లుగా ఇంటర్ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులులేని (ఆర్ఫన్) విద్యార్థినులు, తల్లిగానీ, తండ్రిగానీ ఎవరో ఒకరు లేని వారు (సెమీ ఆర్ఫన్), బడి బయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. http ://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ అందుతుంది.

కేజీబీవీల్లో ఖాళీలు...

జిల్లాలో 32 కేజీబీవీలున్నాయి. ప్రస్తుతం ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌కు నూతన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయనున్నారు. ఆరో తరగతిలో ఒక్కో కేజీబీవీలో 40 సీట్ల చొప్పున 1,280, ఇంటర్ ఫస్టియర్‌లో ఒక్కో కేజీబీవీకి 40 చొప్పున 1,280 సీట్లు ఖాళీలున్నాయి. 7, 8, 9, 10, ఇంటర్ సెకెండియర్‌లో 210 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 2,770 సీట్లను భర్తీ చేయనున్నారు.


పాల్‌పై విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న టీచర్లు

నాణ్యమైన బోధన, వసతి


అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన బోధన, వసతి, ఇతర సదుపాయాలు కల్పిస్తోంది. రెసిడెన్షియల్ మోడ్‌లో బోధన అందిస్తున్నారు. అకడమిక్ క్లాసులతోపాటు, యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఉచిత స్టూడెంట్ కిట్స్ కింద నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నారు. పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు, ఆహ్లాదకర వాతారవణంలో బోధిస్తున్నారు. ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యపై మెలకువలు నేర్పుతున్నారు. 32 కేజీబీవీల్లో గణితం, ఆంగ్లం, తెలుగు టీచర్లకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్ (పాల్) ప్రోగ్రాం కింద శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకమైన సైన్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా సదుపాయాలు అందుబాటులో ఉండటంతో... కేజీబీవీల్లో సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఉంది. ఏటా 250 నుంచి 300 పైచిలుకు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు వస్తాయంటే... ఏ స్థాయిలో డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. అయినా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసిన విద్యార్థుల్లో అర్హులకే నేరుగా సీటు కేటాయింపు మెసేజ్‌లు రాష్ట్ర కార్యాలయం నుంచి అందుతాయి.

అడ్మిషన్లపై స్పెషల్ డ్రైవ్

శైలజ, ఏపీసీ, అనంతపురం



కేజీబీవీల్లో ఆహ్లాదకర వాతావరణంలో బోధన అందిస్తున్నాం. 32 కేజీబీవీల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 11వ తేదీ వరకు స్వీకరిస్తాం. వీటిపై స్పెషల్ డ్రైవ్ పెట్టాం. ప్రిన్సిపాళ్లు, సీఆర్పీలను ప్రభుత్వస్కూళ్లకు పంపి హెచ్ఎంలతో మాట్లాడిస్తున్నాం. ఆర్ఫన్, సెమీ ఆర్ఫన్, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి ప్రవేశాలు కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాం. స్కూళ్ల రీ ఓపెన్ అయిన వెంటనే నెల రోజులపాటు విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ద్వారా అదనపు బోధన కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

గుణాత్మక విద్య

ప్రభుత్వం కేజీబీవీల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. బాలికలను చదువుతోపాటు అన్ని రకాలుగా ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో ఉచితంగా పుస్తకాలు అందిస్తోంది. క్వాలిఫైడ్ టీచర్లను కూడా నియమించి, బోధన అందిస్తోంది. 6 నుంచి 12వ తరగతి వరకూ ప్రవేశాలకు అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రభుత్వ స్కూళ్లలో చదివిన పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ప్రసాద్‌బాబు, అనంతపురం డీఈఓ

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి

ఫ్యాప్టో నాయకుల డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ, సరండర్ లీవ్స్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు సుమారు రూ.30 వేల కోట్లు ఉండగా.. రూ.7300 కోట్లు మాత్రమే చెల్లించారని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఇంకా రూ.23 వేల కోట్లు చెల్లించేలా చూడాలని కోరారు. జడ్పీ, ఎంపీపీ, ఇతర లోకల్ బాడీ స్కూళ్లలో పనిచేస్తూ... కరోనా సమయంలో చనిపోయిన టీచర్ల పిల్లలకు వెంటనే కారుణ్య నియామకం కింద ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఉన్న 3 డీఏలు విడుదల చేయాలని కోరారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగు మీడియం స్కూళ్లను సైతం కొనసాగించాలని, పార్ట్ టైం టీచర్లను ఫుల్ టైంగా పరిగణించాలని కోరారు. ఎంటీఎస్ టీచర్లకు 12 నెలల పూర్తి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

డాక్టర్లు బాగా చూస్తున్నారా..?

- మందులు ఇస్తున్నారా..? భోజనం బాగుంటుందా..?
- రోగులను అడిగిన కలెక్టర్
- జిల్లా ఆసుపత్రిలో రెండుగంటల పరిశీలన
- హెచ్‌ఓడీలు, డాక్టర్లతో సమావేశం
- ఆరోపణలు, సమయ పాలనపై ఆగ్రహం


ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనం తింటున్న కలెక్టర్, వైద్యాధికారులు

అనంతపురం టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): 'డాక్టర్లు వస్తున్నారా..? వైద్యం బాగా చేస్తున్నారా..? మందులు ఉచితంగా ఇస్తున్నారా.. బయట తీసుకొచ్చుకుంటున్నారా..' అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ రోగులతో ఆరా తీశారు. బుధవారం కలెక్టర్ జిల్లా సర్వజన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలపాటు వివిధ విభాగాలను పరిశీలించారు. ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్న రోగి రామాంజనేయులు వద్దకు వెళ్లి.. ఆసుపత్రికి ఏ సమస్యతో వచ్చావు.. ఇక్కడ చేరి ఎన్నిరోజులయింది.. డాక్టర్లు రోజూ వస్తున్నారా.. బాగా చూస్తున్నారా.. మందులు ఉచితంగా ఇస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే భోజనం నాణ్యత గురించి ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ రోగులకు వడ్డించే ఆ భోజనాన్ని రుచి చూశారు. వార్డులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

● సమయపాలన పాటించకపోతే చర్యలు

డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి రోగులకు వైద్యసేవలు అందించాలని, లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఆసుపత్రి పరిశీలన అనంతరం వైద్యాధికారులు, హెచ్‌ఓడీలు, వైద్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ డాక్టర్లు విధులకు డుమ్మాపై పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, మీకు ఏమీ అనిపించలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదగా మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆయా విభాగాల హెచ్‌ఓడీలు పర్యవేక్షించాలని, వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. డాక్టర్లు వృత్తి ధర్మాన్ని విస్మరించరాని తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఆసుపత్రికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. సమస్యలను నివేదిక రూపంలో తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున, ఆర్ఎంఓలు రామక్రిష్ణ, హేమలత, పద్మజ, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రైల్వే ఆదాయం రూ.2,092.13 కోట్లు

- ప్రయాణికుల చేరవేతలో తగ్గిన ఆదాయం
- సరుకు రవాణాతో లాభాల బాట



గుంతకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో గుంతకల్లు రైల్వే డివిజన్ రూ.2,092.13 కోట్ల నికర ఆదాయాన్ని సాధించింది. ప్రయాణికుల చేరవేత ద్వారా లభించిన ఆదాయం టార్గెట్ కంటే గత సంవత్సరం తగ్గినా, ఆ లోటును భర్తీచేస్తూ సరుకు రవాణా ద్వారా రైల్వే ఆదాయాన్ని సముపార్జించింది. పలు కారణాలుగా ప్రయాణికుల చేరవేత గతేడాది కంటే ఎక్కువ జరిగినా, ఆదాయం మాత్రం తగ్గింది. కిందటి సంవత్సరంతో పోలిస్తే రైల్వే డివిజన్‌కు ప్యాసింజర్ అర్నింగ్స్‌లో 3.08 శాతం ఆదాయం తగ్గగా, సరుకు రవాణాలో రూ.15.5 శాతం అదనపు ఆదాయం లభించింది. పార్సిల్స్, ప్లాట్‌ఫాంల టిక్కెట్ల అమ్మకం ద్వారా 3.61 శాతం ఆదాయ వృద్ధి జరగ్గా, స్కూటర్ పార్కింగ్, తదితర ఆదాయాల విషయంగా 41.15 శాతం అదనపు లాభాలను కైవసం చేసుకుంది. కాగా టిక్కెట్టు లేని ప్రయాణికుల నుంచి అపరాధ రుసుముల వసూలులో రైల్వే డివిజన్ 5.44 శాతం వెనెకబడింది.

ప్రయాణికులు పెరిగినా..

కిందటి సంవత్సరంతో పోలిస్తే గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రైళ్లను ఎక్కే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023-24 సంవత్సరంలో 3.14 కోట్ల మంది రైళ్లలో ప్రయాణించగా, గత ఆర్థిక సంవత్సరంలో 3.91 కోట్ల మంది రైలెక్కారు. 2023-24 సంవత్సరంలో రూ.1,018.41 కోట్ల ఆదాయం లభించగా, గత సంవత్సరం రూ.987 కోట్లు మాత్రమే వచ్చింది. వెరసి ప్రయాణికుల చేరవేత ద్వారా రూ.31.41 కోట్ల (3.08) ఆదాయం తగ్గింది. గత సంవత్సరంలో ప్యాసింజర్ల ద్వారా ఆదాయం తగ్గడానికి కారణాలను రైల్వే అధికారులు వివరించారు. 2024-25 సంవత్సరంలో కనీస ప్రయాణపు టిక్కెట్టును రూ.30 నుంచి రూ.10కి తగ్గించినట్లు తెలిపారు. కరోనా సమయంలో కనీస టిక్కెట్టు రేటును రూ.10 నుంచి రూ.30కి పెంచి, ప్యాసింజరు రైళ్లకు ప్రీమియం రైలు రేట్లను వసూలు చేశారు. ఆ రేట్లు గత సంవత్సరంలో తగ్గించారు. అలాగే గతంలో రిజర్వేషన్ టిక్కెట్ల జారీ రైలు బయలుదేరే రోజుకు 4 నెలల ముందుగా జరిగేది. గత నవంబరు 1వ తేదీ నుంచి ఆ గడువును రెండు నెలలకు కుదించారు. దీని వల్ల ఈ సంవత్సరం జూన్, జూలైలో రైళ్లలో ప్రయాణించదలిచేవారు టిక్కెట్లను ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాకుండా ఏప్రిల్, మే నెలల్లో కొంటారు. ఈ కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల ద్వారా లభించే రెండు నెలల ఆదాయం రైల్వేకి తగ్గిందని వివరించారు.

సరుకు రవాణా ఆదాయం భేష్

రైల్వే డివిజన్‌కు సరుకు రవాణా ద్వారా గణనీయమైన ఆదాయం లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.851.84 కోట్ల ఆదాయం లభించగా, గడచిన సంవత్సరం రూ.983.85 కోట్ల అర్నింగ్స్ వచ్చాయి. తద్వారా రైల్వే డివిజన్‌కు గత ఆర్థిక సంవత్సరంలో రూ.132.01 కోట్ల అదనపు ఆదాయం లభించగా, వృద్ధి రేటు 15.50 శాతానికి పెరిగింది. ప్రయాణికుల ద్వారా తగ్గిన ఆదాయం కంటే మూడింతల అధిక ఆదాయం గూడ్స్ ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా లభించింది. 2023-24లో ప్రయాణికులు, సరుకు రవాణా ద్వారా రైల్వేకు లభించిన మొత్తం ఆదాయం రూ.1982.51 కోట్లు. 2024-25లో రూ.2092.13 కోట్ల ఆదాయం రావడంతో నికరంగా రైల్వే డివిజన్‌కు రూ.109.62 కోట్ల ఆదాయం లభించడం గమనార్హం.

చిక్కిపోయిన చిక్కమ్మ..!

అప్పు చెల్లించనందుకు క్షుద్రపూజల నాటకం

పోలీసుల విచారణలో నిజం బట్టబయలు


క్షుద్రపూజలను పరిశీలిస్తున్న పోలీసులు


చిక్కమ్మ

కణేకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో పగ తీర్చుకునేందుకు క్షుద్ర పూజల నాటకం ఆడిన చిక్కమ్మ.. పోలీసులను పరుగులు పెట్టించి.. చివరగా తానే చిక్కిపోయింది. కణేకల్లు పట్టణంలోని దిగువగేరిలో ఉంటున్న చిక్కమ్మ.. చాంద్‌బాషా అనే వ్యక్తికి రూ.1.20 లక్షలు అప్పు ఇచ్చింది. ఆ సొమ్మును చాంద్‌బాషా తిరిగి ఇవ్వలేదు. దీంతో వడ్డీతో ఆ మొత్తం రూ.3 లక్షలకు చేరింది. ఈ క్రమంలో ఆర్థిక సమస్యల కారణంగా చాంద్‌బాషా ఇటీవల ఊరు విడిచి వెళ్లిపోయాడు. చిక్కమ్మ తనకు రావాల్సిన సొమ్ము కోసం చాంద్‌బాషా ఇంటివద్దకు మంగళవారం వెళ్లి, కుటుంబ సభ్యులను నిలదీసింది. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఇంటికి చేరుకుంది. వారిపై ఎలాగైనా పగ సాధించాలని అనుకుంది. తన ఇంటి ముందు మంగళవారం అర్ధరాత్రి ముగ్గు వేసి, అందులో నిమ్మకాయలు, టెంకాయలు పెట్టింది. ఇంట్లోకి వెళ్లి తనను తాను బంధించుకుంది. చుట్టుపక్కలవారు బుధవారం ఉదయం గమనించి, ఇంట్లోకి వెళ్లి చిక్కమ్మను విడిపించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు.. ఇంటి వద్దకు వెళ్లి చిక్కమ్మను విచారించారు. అర్ధరాత్రి కొందరు వచ్చి తన ఇంటి ముందు క్షుద్ర పూజలు చేశారని, తనను బంధించి ఇంట్లో ఉన్న రూ.4 లక్షలు, మూడు తులాల బంగారు ఎత్తుకుపోయారని, చాంద్ బాషా కుటుంబంపై అనుమానం కలిగేలా ఆమె కథ అల్లి చెప్పింది. దీంతో పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేశారు. ఎవరూ వచ్చిన ఆనవాళ్లు లేకపోవడంతో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు చిక్కమ్మను అనుమానించి గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె నిజం ఒప్పుకుంది.

ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరించొద్దు

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత హితవు



అనంతపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలంలో ఇప్పటి వరకూ ఫ్యాక్షన్ హత్యలు లేవని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లిలో అనుకోకుండా జరిగిన సంఘటనను ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఆమె హితవు పలికారు. ఈ మేరకు బుధవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత మీడియాతో మాట్లాడుతూ... ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉండి కూడా ఎంపీపీని గెలుచుకోలేని దద్దమ్మ ప్రకాష్‌రెడ్డి అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పార్టీ ఎంపీటీసీలు మీవైపే ఉంటే క్యాంపులకు ఎందుకు తరలించారని ప్రకాష్‌రెడ్డిని ప్రశ్నించారు. రాప్తాడు నియోజకవర్గంలోకి మరో వైసీపీ నేత వచ్చాడనే కంగారుతో, ఏదో విధంగా జగన్ దృష్టిలో పడాలనే లేనిపోని రచ్చ చేస్తున్నాడంటూ మండిపడ్డారు. తమకు ఎంపీపీని గెలుచుకోవాలన్న ఉద్దేశ్యమే ఉంటే నీవు ఆపలేవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. తమ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అప్పట్లో ఆదేశించిన నేపథ్యంలోనే... పోటీ చేయలేదన్నారు. చంద్రబాబు ఆదేశించకపోయి ఉంటే ఆరు మండలాల్లో ఎంపీపీలు తెలుగుదేశం పార్టీ వారే ఉండేవారని ఆమె స్పష్టం చేశారు. అనుకోకుండా జరిగిన పాపిరెడ్డిపల్లి ఘటనను ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. లింగమయ్య ఇంటి పేరును మార్చి కురబ లింగమయ్య అంటూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తాము బిజీగా ఉన్నామన్నారు. తామనుకుంటే నియోజకవర్గంలో కాదు... జిల్లాలో కూడా అడుగు పెట్టలేవని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఆమె హెచ్చరించారు.

మీ అరాచకాలు ఎదుర్కొంటాం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ అరాచకాలను ఎదుర్కొనేందుకు వైసీపీ సిద్ధంగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో మెజార్టీ లేదని తెలిసినా అధికారపార్టీ ప్రజాప్రతినిధులు దౌర్జన్యాలు చేశారని అన్నారు. అంతచేసినా 51 స్థానాలలో 39 చోట్ల వైసీపీ విజయం సాధించిందని అన్నారు. చట్టపరిధిలో అవకాశం ఉంటే స్థానిక సంస్థలను రద్దు చేయాలని, ఎన్నికలకు వెళదామని సవాలు విసిరారు. దొడ్డిదారిలో వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. కురుబ లింగమయ్య కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ నెల 8న వైఎస్ జగన్ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న దౌర్జనాలు, అరాచకాలకు సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా చంద్రబాబు ప్రచార ఆర్భాటానికే పరిమితమయ్యారని, పీ-4 బూటకమని విమర్శించారు. పది నెలల వ్యవధిలో 3 లక్షలకు పైగా పింఛన్లను కోత పెట్టారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికిపైగా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం లేదని అన్నారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా జిల్లాకు 55 టీఎంసీల నీరు వస్తే కేవలం 55 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని కలెక్టర్ ప్రకటించారని, ఇంతకంటే దురదృష్టం ఇంకొకటి ఉంటుందా అని ప్రశ్నించారు.

లక్ష్యం దాటిన పన్నుల శాఖ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ లక్ష్యాన్ని అధిగమించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జీఎస్టీ వసూళ్లలో జిల్లా అధికారులు ప్రతిభ చూపారు. రూ.368.98 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.381.18 కోట్లు వసూలు చేశారు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జాయింట్ కమిషనర్ శేషాద్రి తెలిపారు.

మెటీరియల్.. శిక్షణ.. ఫ్రీ..!

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహణ

దగ్గరలోని కాలేజీలో వెంటనే చేరిపోవచ్చు..

పాలిసెట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ వరం

7

టీఎంసీ నీరు నిల్వ చేయడమే లక్ష్యం

ఏడాదిలో 1.10 కోట్ల ఉపాధి పనిదినాలు కల్పించాం

డ్వామా పీడీ సలీం బాషా



ఇంటర్వ్యూ interview

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నీటి కుంటల నిర్మాణంతో జిల్లాలో టీఎంసీ నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ సలీంబాసా తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: నీటి కుంట అంటే ఏంటి? దాని ఉపయోగం ఏంటి?

జవాబు: రైతుల పొలాల్లో వర్షపునీటిని అక్కడే ఇంకింపజేయడానికి తీసే గుంతనే నీటికుంట అంటారు. దీని నిర్మాణంతో పొలాలకు మందులు కొట్టేందుకు, పశువులు, పక్షులకు తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను సాగుచేసుకునే అవకాశాలుంటాయి.

ప్రశ్న: జిల్లాకు ఎన్ని నీటికుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ణయించారు?

జవాబు: జిల్లాలో జూన్ చివరి నాటికి 9వేల నీటికుంటల నిర్మాణం చేపట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 550 నిర్మాణం పూర్తి చేశాం. గడువులోగా లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. 9వేల నీటి కుంటల నిర్మాణం పూర్తిచేస్తే టీఎంసీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం జిల్లాకు లభిస్తుంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఉపాధి పనిదినాలు కల్పించారు?

జవాబు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాలు లక్ష్యం పెట్టుకోగా... ఇప్పటి వరకు 1.10కోట్ల పనిదినాలు పూర్తి చేశాం. కనీస వేతనం రూ.265 కాగా.. ప్రస్తుతం రూ.263 చొప్పున జమవుతోంది. ప్రస్తుతం పండుగల కారణంగా కొద్దిగా పనిదినాలు తగ్గాయి.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.. ఎంతమంది కూలీలు ఉన్నారు...?

జవాబు: జిల్లాలో 3.14 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4.66 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 89వేల జాబ్‌కార్డులు ఉండగా.. 1.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. 10వేలు ఎస్టీ జాబ్‌కార్డులు ఉండగా.. 20వేల మంది కూలీలు ఉన్నారు. మొత్తంగా 3 లక్షల మంది మహిళా కూలీలు ఉన్నారు. 59వేల జాబ్‌కార్డులకు వందరోజుల పనిదినాలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 19వేల జాబ్‌కార్డులకు పూర్తి చేశాం.

● వేసవి రాకతో డిమాండ్ ● చల్లటి తాగునీటి కోసం కొనుగోలు ● ఎన్నెన్నో ఆరోగ్య ప్రయోజనాలు

కు(ఎ)ండల కాలం

వేసవి వచ్చింది. ఎండలు మండిపోతున్నాయి. కాసిన్ని చల్లనీరు తాగాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. ఫ్రిజ్‌లోని నీరు తాగుతుంటారు. ఇటీవలిగా చల్లని మట్టి కుండలోని నీరు తాగేవారి సంఖ్య పెరుగుతోంది. కుండలోని నీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో కుండలోని నీరు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. ఎటుచూసినా.. మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

హిందూపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏ ఇంట్లో చూసినా మట్టి కుండ ఉండేది. చెలిమ నుంచి నీరు పట్టుకుని రావడం మొదలుకుని నిలువ ఉంచడానికి అన్నింటికీ మట్టి కుండలనే వినియోగించేవారు. ఓ రకంగా చెప్పాలంటే అప్పట్లో ప్రతి ఇంట్లో కుండ నిత్యవసర వస్తువు. పండుగ సమయాల్లో కచ్చితంగా మట్టిపాత్రలు కొత్తవి కొనుగోలు చేసేవారు. అందులోనే వంటలు వండి ఆరగించేవారు. మారిన కాలానుగుణంగా మట్టి కుండలకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఒకానొక దశలో మట్టి కుండలు కొనేవారు, వాడేవారు లేకుండాపోయారు. కొన్నేళ్లుగా పరిస్థితుల్లో మార్పు వస్తోంది. ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. మట్టి పాత్రలు ఆరోగ్యానికి ఎంతో మేలు అని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో మళ్లీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి. ఫ్రిడ్జ్ నీటికంటే మట్టికుండలో నీరే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. దీంతో వేసవిలో వీటికి గిరాకీ పెరిగింది.

ఆరోగ్యానికి మేలు

మట్టికుండలోని నీరు తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు చూకూరుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గొంతునొప్పి, జలుబు, ఇతరత్రా వ్యాధులు నివారించవచ్చని చెబుతున్నారు. మట్టి కుండలో నీరు తాగడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

చలివేంద్రాల్లో ఇవే..



వేసవి ప్రారంభం కావడంతో పట్టణాల్లో చాలాచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. పెద్దపెద్ద కుండలు ఉంచి కొన్నిచోట్ల మజ్జిగ, మరికొన్నిచోట్ల నీరు ఉంచి బాటసారులు, ప్రయాణికులకు అందిస్తుంటారు. దీంతో మట్టికుండలకు గిరాకీ పెరిగింది. పెద్దపెద్ద పట్టణాలు, నగరాల్లో సైతం మట్టికుండలు, బిందెలు, కూజాల విక్రయాలు పెరిగాయి. ప్రస్తుతం జనాల అవసరాలకు తగ్గట్టుగా వీటికి ట్యాప్‌లు బిగించి, అమ్ముతున్నారు. 5 లీటర్లు మొదలుకుని 30 లీటర్ల కుండలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో వీటి ధరలు రూ.100 నుంచి 500దాకా పలుకుతున్నాయి. వేసవి కావడంతో పది శాతం ధరలు పెంచినట్లు తెలుస్తోంది.

వేసవిలోనే అమ్మకాలు



వేసవి కాలంలో, ఎండలు అధికంగా ఉన్న సమయంలోనే మట్టి కుండలు అమ్మకాలు బాగుంటాయి. మిగిలిన రోజుల్లో రెండు మూడు కుండలు కూడా అమ్ముడుపోవు. ఈ మూడు నెలలు వేసవిలో రోజుకు 20 నుంచి 30 కుండలు అమ్ముడవుతాయి.

-పిల్లప్ప, కుండల వ్యాపారి

తప్పనిసరిగా కొంటాం..



ఇరవై ఏళ్ల క్రితం ప్రతి ఇంట్లోనూ మట్టి కుండలు ఉండేవి. ధాన్యం నిల్వకు కూడా వీటిని ఉపయోగించేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కానీ వేసవిలో తప్పనిసరిగా కుండలను వాడుతున్నాం. ఫ్రిజ్ నీళ్లకంటే కుండల్లో నీరే ఆరోగ్యానికి మంచిదని మా పెద్దలు చెప్పేవారు.

- నాగన్న, కగ్గల్లు

ఏళ్లుగా కుండ నీరే..



ప్రతి సంవత్సరం వేసవిలో తప్పనిసరిగా తాగునీటి కోసం కొత్తకుండలు కొనుగోలు చేస్తాం. మారిన కాలానికి అనుగుణంగా కొళాయి ఉన్న కుండలని తీసుకెళ్తున్నాం. ఎర్రటి మట్టి కుండలో నీరు చాలా చల్లగా ఉంటుంది.



- రహంతుల్లా, మేళాపురం



మొండిగోడలకు పరిమితమైన ఇండోర్ స్టేడియం





↑ శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి భవనం

ఎన్నేళ్లకు పూర్తవుతాయో..?

- ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- ప్రారంభం కాక మునుపే నెర్రెలు చీలిన గోడలు
- దాదాపు రూ.5కోట్ల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధరకాల ప్రభుత్వ భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తికాక మునుపే గోడలు నెర్రెలు చీలడం, బండపరుపు దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయి.పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆసుపత్రితో పాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు నిధులు మంజూర య్యాయి. నిధులు మొత్తం ఖర్చు చేసి నిర్మాణం దాదాపు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఇంకా రూ.20 లక్షల మేర నిధులు కావాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నూతన భవనం శిథిలావస్థకు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంచాలన్న ఉద్దేశంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. చిన్నబజారులోని పాతకూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోవడంతో వృథాగా మారి ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పాతకోటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. నిర్మాణం పూర్తికావాలంటే మరో రూ.40లక్షలు కావాల్సి ఉంటుంది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించు కుంటున్నారు.

రూ.5 కోట్ల ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాల కోసం విడుదల చేసిన రూ.5కోట్లు వృథాగా మారాయి. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనపు నిధులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దాదాపు ఎనిమిదేళ్లు అవుతుండటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగు చొరవ చూపి భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

ప్చ్... ఉపయోగం లేదు

మూగజీవాలకు తప్పని నీటి కష్టాలు

పామిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో మనుషులకే కాదు మూగజీవాలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోవడంతో వ్యవసాయ బోర్లతో పాటు గ్రామాల్లోనూ నీటి పథకాల బోర్లు, చేతి పంపుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. మండలంలోని చెరువులు, కుంటలు, బావులలో నీరు ఇంకిపోతోంది. ఒకవైపు గ్రాసం కొరత మరోవైపు దాహార్తితో పశువులు అలమటిస్తున్నాయి. దీంతో తమ పశువులను ఎలా బతికించుకోవాలో తెలియడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దాదాపు గేదెలు 9400లు, గొర్రెలు, మేకలు 41000, కోళ్లు 11000 ఉన్నట్లు పామిడి ప్రభుత్వ పశువైద్యాధికారిణి ఉషాకిరణ్ పేర్కొన్నారు. ఈ మూగజీవాలకు వేసవిలో నీరందించలేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు
పట్టించుకోని అధికారులు
ఆందోళనలో పాడి రైతులు



దేవరపల్లిలో కంపచెట్లలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటితొట్టె

నీటి తొట్లు వృథా

మండలంలోని దేవరపల్లి, సొరకాయలపేట, అనుంపల్లి, దిబ్బసానిపల్లి, ఖాదర్‌పేట, రామగిరి, ఎదురూరు తదితర గ్రామాలలో రూ.వేలాది ప్రజాధనం వెచ్చించి పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించారు. నిర్వహణ కరువవడంతో నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో రెండు నీటి తొట్టెలను నిర్మించారు. తొట్టెలను నిర్మించి నిధులు కాజేశారే తప్ప పశువుల దాహార్తిని తీర్చలేకపోయారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో నీటి తొట్టెలు ధ్వంసమయ్యాయి. దిబ్బసానిపల్లి, కట్టకిందపల్లి గ్రామాల్లో నీటి తొట్టెలలో నీరు ఉండటంతో మూగజీవులకు దాహార్తి తీరుతోంది. నిర్మించిన నీటి తొట్టెలకు బోరుబావులు, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించి నీటి తొట్టెలను నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు.

కలచివేస్తోంది: సుదర్శన్‌బాబు, పాడిరైతు, రామగిరి



వేసవిలో మూగజీవాల రోదన పాడి రైతులను ఎంతగానో కలచివేస్తోంది. గ్రామంలో నీటి తొట్టెను నిర్మించి చేతులు దులుపుకున్నారు. తొట్టెను నీటితో నింపిన పాపానపోలేదు. ఎన్నో పశువులు వేసవిలో దాహం తీర్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాయి. మూగజీవాలను చూస్తే కడుపు తరుక్కుపోతోంది. అధికారులు చొరవ తీసుకొని నీటితొట్టెలను వినియోగంలోకి తేవాలి.

నీటి తొట్టె నిర్మించాలి



రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ పాడి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. పాడి రైతులకు అధికారులు ఏ పథకాలపైన ఎలాంటి సమాచారమూ ఇవ్వరు. ఈ వేసవిలో పశువులు దాహార్తి తీర్చడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాం. పశువుల కోసం నీటితొట్టెలను నిర్మిస్తే చాలా బాగుంటుంది. పశువులు, పాడిరైతులను పట్టించుకునే వారేలేరు.


-రాఘవేంద్ర, పాడిరైతు, నీలూరు

తిరుపతి ప్యాసింజరు పాక్షిక పునరుద్ధరణ

గుంతకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కుంభమేళా నేపథ్యంలో రద్దయిన తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు రైలును రైల్వే అధికారులు పాక్షికంగా పునరుద్ధరించారు. 1వ తేదీ సాయంత్రం కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు (నం. 57406) రైలును గుంతకల్లు నుంచి ప్రారంభించారు. ఈ రైలును డిసెంబరు 28వ తేదీ నుంచి రద్దుపరచి ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పంపారు. ఈ రైలు గతనెల 1వ తేదీనే పునఃప్రారంభం కావాల్సి ఉండగా, కుంభమేళా నుంచి భక్తులను స్వస్థలాలకు తరలింపు కార్యక్రమం కోసం ఆ తేదీని మార్చి నెలాఖరుకు వాయిదా వేశారు. మార్చి 27వ తేదీకి తిరుపతి ప్యాసింజరు రైళ్లు డివిజన్ కేంద్రానికి చేరగా, యార్డులో నిలిపి ఉంచారు. ఈ రైళ్లను ఎప్పుడు ప్రారంభించనున్నారో రైల్వే అధికారులు ముందుగా ప్రకటించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెప్పాపెట్టకుండా ప్యాసింజరు రైలును కదిరిదేవరపల్లి నుంచి కాకుండా గుంతకల్లు నుంచి తిరుపతికి పాక్షికంగా పునరుద్ధరించారు. మెయింటెనెన్స్ పనుల కారణంగా కదిరిదేవరపల్లి-గుంతకల్లు సెక్షన్‌లో రైలును పాక్షికంగా రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో తిరిగేలా రెన్యూవల్ చేశారు. అలాగే తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/04) రైలును కూడా పునరుద్ధరించారు. కిందటి వారమే తిరుపతి-హుబ్లీ-తిరుపతి ప్యాసింజరు (నం. 57401/02) రైలును పునరుద్ధరించారు.

పీఏబీఆర్‌లో అడుగంటిన నీరు





చెర్లోపల్లి రిజర్వాయర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండుతున్న వేసవికి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోతున్నాయి. ఆయా రిజర్వాయర్లలో ఇప్పటికే నీటి నిల్వలు కనిష్ఠస్థాయికి చేరాయి. జలవనరుల శాఖ ఇంజనీర్లు మాత్రం నీటి నిల్వలు తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఉన్నాయని చెబుతున్నా రిజర్వాయర్లలో ఆ స్థాయిలో నీటి నిల్వలు లేవని తెలుస్తోంది. రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగంతో సమన్వయం చేసుకుని నీటి నిల్వ, వేసవిలో తాగునీటి అవసరాలను బేరీజు చేసుకుని సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రధానం గా శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా ద్వారా, టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు సాగు, తాగునీరు అందుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం, టీబీ డ్యాం నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నేపథ్యం లో ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని కాపాడుకుం టూ...పొదుపుగా నీటిని వినియోగించుకోవడంపైనే దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- అడుగంటుతున్న జలాశయాలు
- వేసవి నీటి ఎద్దడిపై ఆందోళన
- ఎండ తీవ్రతతో ఆవిరవుతున్న జలాలు
- పొంచి ఉన్న నీటి గండం

వేగంగా..!

జీడిపల్లి రిజర్వాయర్‌లో పడిపోయిన నీటి నిల్వ




ఉమ్మడి జిల్లాలో జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి

జిల్లాలోని రిజర్వాయర్లు.. వాటి సామర్థ్యం.. ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలిస్తే.. హంద్రీనీవా కింద జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.490టీఎంసీల నీటి నిల్వ ఉంది. గొల్లపల్లి 1.913టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.180టీఎంసీలు, మారాల 0.483టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.250టీఎంసీలు, చెర్లోపల్లి 1.608 టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.410టీఎంసీల నీరు నిల్వ ఉంది. పేరూరు డ్యాం 1.810టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.450టీఎంసీలు, భైరవానితిప్ప ప్రాజెక్ట్ 2.1టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.510టీఎంసీల నీరు ఉంది. హెచ్చెల్సీ కింద చాగల్లు రిజ ర్వాయర్ 1.5టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.660టీఎంసీలు, పెండేకల్లు 0.655టీఎంసీలుగా కాగా ప్రస్తుత 0.198టీఎంసీలు, పెనకచెర్ల డ్యాం (ఎంపీఆర్) 5.200టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.795టీఎంసీలు, పీఏబీఆర్ డ్యాం 11.10టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 2.174టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

ఎండల తీవ్రత సాధారణం కంటే అధికం

ఈ ఏడాది సాధారణం కంటే ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం జలవనరుల పరిస్థితి బా గానే ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వేసవి తీవ్రత పెరగడంతో జలాశయాల్లో నీరు వేగంగా అడుగంటి పోతుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరా చేయడంపైనే దృష్టి పెట్టారు. ఇప్పటికే పలుమార్లు నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై రెండు జిల్లాల కలెక్టర్లతో జలవనరుల శాఖ ఇంజనీర్లు సమీక్షించి అంచనాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జిల్లాల యంత్రాంగంతో జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లు సమన్వయం చేసుకుంటూ రిజర్వాయర్లలో నీటి నిల్వపై అంచనా వేస్తున్నారు.



గొల్లపల్లి రిజర్వాయర్

తాగునీటికి ఇబ్బంది లేదు: నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ



వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉంచాం. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో జలాశయాల్లో నీరు వేగంగా ఆవిరి అవుతూ, భూమిలోకి ఇంకిపోతోంది. ఇది కొంత మేర ఆందోళన కలిగించినా... జూన్, జూలై నెల వరకు తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా అందించేందుకు రిజర్వాయర్లలో నీటి లభ్యత ఉంది. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగానికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఆయా రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు, ప్రణాళికలపై చర్చించాం. ఎక్కువగా అనంతపురం, హిందూపురానికి నీటిని ఇవ్వాలని సూచించారు. అందుకు అనుగుణంగా మా ఇంజనీర్లకు నీటి సరఫరాపై పలు సూచనలు ప్రభుత్వం ఇచ్చింది. ప్రణాళిక ప్రకారమే తాగునీటిని సరఫరా చేస్తాం.

హత్య కేసులో జీవిత ఖైదు

అనంతపురం క్రైం, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను చంపిన కేసులో ముద్దాయికి జీవిత ఖైదు పడింది. నార్పల మండలం బండ్లపల్లి (ప్రస్తుత నివాసం అనంతపురం నగర శివారులోని నందమూరినగర్)కు చెందిన దూదేకుల సిద్దయ్యకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి బుధవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. దూదేకుల సిద్దయ్య అప్పటికే వివాహమైన వడ్డే రామాంజినమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె తనను పెళ్లి చేసుకోమని సిద్దయ్యను బలవంతం పెట్టింది. ఆ క్రమంలో 2014 ఫిబ్రవరి 25న సిద్దయ్య.. రామాంజినమ్మను ఇంద్రజిత్‌నగర్‌లోని కంపచెట్లలోకి తీసుకెళ్లి, చంపేశాడు. ఆమె మెడలోని ఐదుతులాల బంగారు నగలు, రూ.3వేల నగదు తీసుకుని పరారయ్యాడు. ఆ నగలను బ్యాంకు, ఫైనాన్స్ సంస్థలో తాకట్టుపెట్టి, వచ్చిన సొమ్ముతో ఆటో కొనుక్కుని జీవనం సాగించసాగాడు. రామాంజినమ్మ హత్యపై ఆమె భర్త రవి అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ దేవానంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సిద్దయ్యను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో 8 మంది సాక్షులను కోర్టు విచారించింది. సిద్దయ్యపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధించింది. ముద్దాయికి శిక్షపడేలా చేసిన సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రూపానాయక్ (ఫైల్)

ఉరవకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్దతాండాలో రూపానాయక్(25) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. అతడి బంధువులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణానాయక్, కమలమ్మ దంపతుల కుమారుడు రూపానాయక్ నిర్మిస్తున్న ఇంటి గోడకు నీరు పడుతుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు లోనయ్యాడు. హుటాహుటిన అతడిని ఉరవకొండ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. రూపానాయక్‌కు వివాహం కాలేదు. ఎస్ఐ నాగస్వామి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని మండలంలోని మల్లప్పగేట్ సమీపాన రైలు ఢీకొని 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ..


ఆవుల గోపాల్ (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం సమీపాన రాణి స్టీల్ ఎస్టేట్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆవుల గోపాల్ (38) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వడిగేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆవుల గోపాల్ మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై పాలసముద్రం నుంచి బెంగుళూరు వైపు వెళ్తూ రోడ్డు పక్కన ఆపివున్న కంటైనర్ లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని హిందూపురం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. గోపాల్‌కు భార్య పుష్ప ఉంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హౌసింగ్‌లో అక్రమాలపై కొరడా

ఇద్దరు ఏఈల తొలగింపు... డీఈకి షోకాజ్ నోటీసులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో హౌసింగ్‌లో అక్రమాలపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గంలో ఇనుము, సిమెంటు అక్రమంగా విక్రయించుకుని సొమ్ము చేసుకున్న వ్యవహారంపై కొరడా ఝుళిపించారు. అప్పట్లో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరులో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఏఈ అనిల్ రూ.2లక్షలు, రాప్తాడు ఏఈ పవన్‌కుమార్ రూ.56 లక్షలు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. రాప్తాడు హౌసింగ్ ఏఈ పవన్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు, దుర్వినియోగం చేసిన రూ.56లక్షల సొమ్ము రికవరీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆత్మకూరు ఏఈ అనిల్ నుంచి రూ.2లక్షలు రికవరీ చేసి, విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. అప్పట్లో డీఈగా పనిచేసిన ప్రస్తుత శింగనమల ఇన్‌చార్జి డీఈ రామమూర్తికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

గార్లదిన్నె, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల విద్యాలయ ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల ప్రవేశాల దరఖాస్తు గడువు గతనెల 30వ తేదీతో ముగిసిందన్నారు. దానిని ఈనెల 6వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.


పోలీస్ శాఖలో పలువురు వీఆర్‌కు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం ఓ హెడ్‌కానిస్టేబుల్, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులను వీఆర్‌కు పంపారు. ఆంధ్రజ్యోతిలో గత నెల 19న వెలువడిన 'సింహం గడ్డి మేస్తే' అనే కథనానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. అనంతపురంలో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను, గుంతకల్లులో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లను, కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల పరిధిలో మరో ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను వీఆర్‌కు తీసుకొచ్చారు. అయితే సీఐ, ఎస్ఐల స్థాయి అధికారులపై కాకుండా కింది స్థాయి సిబ్బందిపైనే చర్యలు తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విడతల వారీగా చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

మెటీరియల్.. శిక్షణ.. ఫ్రీ..!

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహణ
దగ్గరలోని కాలేజీలో వెంటనే చేరిపోవచ్చు..
పాలిసెట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ వరం


పాఠాలు బోధిస్తున్న ఫిజిక్స్ లెక్చరర్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఆధ్వర్యంలో పాలిసెట్-2025 నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 15వరకు దరఖాస్తులు స్వీకరించి, 30న పరీక్షలు నిర్వహిస్తారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసి, శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు తరగతులు కొనసాగుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బోధన ఉంటుంది. విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి, పదో తరగతి హాల్ టికెట్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అదే రోజు తరగతులకు హాజరు కావచ్చని అధికారులు తెలిపారు.

ఉచిత కోచింగ్ సెంటర్ల వివరాలు

ప్రభుత్వ కళాశాల	సెల్ నంబరు
అనంతపురం	8985703601, 9493523133
నార్పల	8096907527
తాడిపత్రి	9010222198
గుంతకల్లు	7075932669
ఉరవకొండ	9505504205
కళ్యాణదుర్గం	9505504207
రాయదుర్గం	9010222165
మడకశిర	9505504206
ధర్మవరం	9010222170
హిందూపురం	9912342058
కదిరి	9010222175

50 వేలకు పైగా అర్హులు

ఉమ్మడి జిల్లాలో 50 వేల మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరందరూ పాలిసెట్‌కు అర్హులు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సంఖ్య భారీగా ఉంది. గడిచిన ఐదేళ్ల పాలిసెట్ నిర్వహణ, ఫలితాల విడుదల, కౌన్సెలింగ్.. ఇలా అన్నీ గందరగోళంగా జరిగాయి. దీంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాశాల్లో ప్రవేశాల శాతం పడిపోయింది. ప్రతిభ, అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నా.. విద్యార్థుల్లేక కళాశాలలు బోసిపోయాయి. ఒక్క అనంతపురం కళాశాల మినహా ఎక్కడా పూర్తిస్థాయి ప్రవేశాలు జరగలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేసి, వందశాతం ప్రవేశాలు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కళాశాలల్లోనే పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇచ్చి, మెరుగైన ర్యాంకులు సాధించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ప్రైవేట్‌కు కళ్లెం

పబ్లిక్ పరీక్షలు ముగియగానే ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ పేరిట ప్రైవేటు కోచింగ్ సెంటర్లు దోపిడీకి దిగడం పరిపాటిగా మారింది. ర్లకు రాష్ట్ర ప్రభుత్వం కళ్లెంవేసింది. పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించి, తమ వద్ద చేరాలని వెంట పడుతుంటారు. పాలిసెట్ రాసేవరకు తరగతుల నిర్వహిస్తామని, భోజనం, వసతి కల్పిస్తామని ఒక్కో విద్యార్థి వద్ద రూ.15వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తుంటారు. అర్హత సాధించిన విద్యార్థులను ప్రైవేటు కళాశాలలకు ప్రమోట్‌చేసి, కమీషన్లు పుచ్చుకుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వమే ఉచిత శిక్షణ, మెటీరియల్ ఇవ్వడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమౌతోంది.

సద్వినియోగం చేసుకోవాలి..



పాలిసెట్‌లో పదో తరగతి పాఠ్యాంశాలతోనే ప్రశ్నపత్రం తయారు చేస్తారు. సెక్షన్-1లో గణితం 50, సెక్షన్-2లో ఫిజిక్స్ 40, సెక్షన్-3లో కెమిస్ట్రీ 30.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు జవాబులు(ఏ, బీ, సీ, డీ) ఉంటాయి. సరైన సమాధానాన్ని గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో ప్రశ్నకు ఎదురుగానున్న వృత్తాకారాన్ని పెన్సిల్‌తో బ్లాక్ చేయాలి. పాలిసెట్ అంటే భయపడాల్సిన అవసరంలేదు. కంగారుపడి వేలకు వేలు ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకోవడం, స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడం తల్లిదండ్రులపై భారం మోపడమే. విద్యార్థుల్లో భయాన్ని పారదోలి, సులువుగా పరీక్షలు రాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసి, తరగతులు నిర్వహిస్తోంది. విద్యార్థులు వారి సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి శిక్షణ పొందవచ్చు.

- వెంకటసుబ్బయ్య, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

నేటి నుంచి టెన్త్ స్పాట్

- విధులకు 1250 మంది నియామకం
- కేఎస్ఆర్‌కు చేరిన 1.80 లక్షల జవాబు పత్రాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాకనం గురువారం నుంచి మొదలవుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ.. ఏడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం కోసం 1250 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. గత నెల 17వ తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకూ పరీక్షలు జరిగాయి. పలు జిల్లాల నుంచి జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. మరో ఒకటి రెండు సబ్జెక్టుల జవాబు పత్రాలు గురు, శుక్రవారాల్లో జిల్లాకు చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ వేర్వేరు జిల్లాల నుంచి 1.80 లక్షల జవాబు పత్రాలు కేఎస్ఆర్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరాయి. మూల్యాంకణం కోసం జిల్లా విద్యాశాఖ, పరీక్షల విభాగం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు అందుబాటులో ఉంచారు. వీటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. పేపర్లు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ), చీఫ్ ఎగ్జామినర్లు(సీఈ), స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని ఇప్పటికే నియమించారు. సుమారు 1100 మందిని రెగ్యులర్, 150 మంది వరకూ ఓపెన్ పరీక్షల స్పాట్ విధులకు కేటాయించారు. వీరందరూ క్యాంపులో గురువారం ఉదయం రిపోర్ట్ చేసుకుంటారు.

సబ్జెక్టు	ఏఈ/సీఈలు
తెలుగు	128
హిందీ	107
ఇంగ్లిష్	143
మ్యాథ్స్	150
ఫిజికల్ సైన్స్	100
బయాలజీ	101
సోషల్	92
స్పెషల్ అసిస్టెంట్లు	233
మొత్తం	1,054 (వీరు కాక.. సహాయకులు ఉంటారు)


స్పాట్ కోసం ఏర్పాటు చేసిన బెంచీలు

ఉదయమే రిపోర్ట్ చేసుకోవాలి..

పదో తరగతి మూల్యాంకనానికి రెగ్యులర్‌కు సుమారు 1100 మందిని, ఓపెన్‌కు 150 మందిని నియమించారు. స్పాట్ డ్యూటీ ఆర్డర్లు అందుకున్న టీచర్లు గురువారం ఉదయం 8.30 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర సమస్యలు ఉన్నవారు డీఈఓ దృష్టికి, నా దృష్టికి తేవాలి. పరిశీలించి, అవకాశం ఉంటే డీఈఓ మినహాయింపు ఇస్తారు. ఇక్కడ డ్యూటీ క్యాన్సిల్ అయిన టీచర్లు విధిగా స్కూల్ డ్యూటీకి వెళ్లాలి.

- గోవింద్ నాయక్, ఏసీ

వేర్వేరుచోట్ల ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి బానిసై ఇద్దరు, క్షణికావేశంలో ఇద్దరు, మనస్థాపంతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

పరిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. కోనాపురం గ్రామానికి చెందిన రామాంజినప్ప, తిప్పక్క దంపతుల కుమారుడు బాబు(26) మద్యానికి బానిసై తరచూ డబ్బు కోసం తల్లిని వేధిస్తుండేవాడు. తిప్పక్క వేరే గ్రామానికి వెళ్లడంతో బుధవారం మద్యం మత్తులో ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా ఊటకూరు దళిత కాలనీకి చెందిన మేకల చౌడమ్మ (74) అనే వృద్ధురాలు మనస్థాపంతో శ్మశానవాటిక సమీపంలో చెట్టుకొమ్మకు ఉరివేసుకుంది. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అనంతలో మహిళ

అనంతపురం క్రైం : నగర పరిధిలోని తపోవనంలో శశికుమార్, లక్ష్మీ(33) దంపతులు నివాసం ఉంటున్నారు. శశికుమార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె, పది నెలల పాప ఉన్నారు. మంగళవారం రాత్రి పిల్లలతో కలిసి దంపతులు ఒకే గదిలో పడుకున్నారు. బుధవారం ఉదయం శశికుమార్ లేచి చూసేసరికి లక్ష్మీ కనిపించలేదు. రెండోగదిలో ఉరికి వేలాడుతున్న కనిపించింది. వెంటనే కిందకు దింపి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు..


మనోజ్ (ఫైల్)

పెనుకొండ రూరల్ : తల్లిదండ్రులు మందలించారని మనస్థాపంతో మనోజ్ (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రొద్దం మండలం కందుకూర్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డిరాజు, తిప్పక్క దంపతుల కుమారుడు మనోజ్ కియా పరిశ్రమలో పని చేస్తుండేవాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికిగురైన మనోజ్ రాత్రి 10గంటల సమయంలో ఇంటి సమీపంలో పాడుబడిన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కాంతప్ప తెలిపారు.

గొర్రెల కాపరి..

ఆత్మకూరు: మండల పరిధిలోని గొరిదిండ్ల గ్రామ సమీపాన ముట్టాల పొలాల వద్ద బుధవారం ఓ గొర్రెలకాపరి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (19) అనే యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెలు మేపేందుకు వచ్చి ఆత్మహత్యచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

జిరసం కార్యవర్గం ఎంపిక

అధ్యక్షుడిగా కొత్తపల్లి సురేష్


కొత్తపల్లి సురేష్, జిరసం అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం (జిరసం)కు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బుధవారం ఉపాధ్యాయ భవన్‌లో జెన్నె ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ రచయిత శాంతినారాయణ నేతృత్వంలో జిరసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడుగా వర్ధమాన కవి కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా కోటిగారి వన్నప్ప, కోశాధికారిగా మధురశ్రీను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు ఏలూరు యంగన్న, డాక్టర్ రాధేయ, తూముచర్ల రాజారాం, ఉప్పరపాటి వెంకటేశులు, విద్యావతి, గోసల నారాయణస్వామి, ఎల్ఆర్ వెంకటరమణ, డాక్టర్ అంకె శ్రీనివాస్, చేగువేరా హరి, ఒంటెద్దు రామలింగారెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జేసీని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తదితరులు కలిశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రతి గ్రంథాలయం రోజూ పాఠకులకు అందుబాటులో ఉండాలన్నారు.

ఆణిముత్యాలకు చేయూత

- పేదవిద్యార్థులకు సాయం
- పారదర్శకంగా ఎంపిక
- కలెక్టర్ వినోద్‌కుమార్


అనంత ఆణిముత్యాలపై సూచనలు ఇస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులకు సహాయం అందించడమే అనంత ఆణిముత్యాలు ఆశయమని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం అనంత ఆణిముత్యాల అమలు, ఆర్థిక సాయం మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదువుకుంటూ ఆర్థికంగా వెనుకబడిన ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, దివ్యాంగుల పిల్లలకు అవకాశం కల్పించాలన్నారు. పోక్సో కేసు బాధితులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, డీఆర్వో ప్రధాన కార్యదర్శిగా అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ 2008 నుంచి జిల్లాలో కొనసాగుతోందని తెలిపారు. దీని ఆశయం నెరవేర్చడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, డీఈఓ ప్రసాద్ బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తొలుత అదనపు సీసీఎల్ఏ ప్రభాకరరెడ్డి.. జిల్లాల కలెక్టర్లతో రీసర్వే, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, ఫిర్యాదుల-పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్.. జిల్లా అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రీసర్వే వివరాలను ఎప్పటికపుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రెండో విడత రీసర్వేకి ఎంపికచేసిన రెండు గ్రామాల్లో పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐని ఎంపి చేసి, వారికి ఈ పనులు అప్పగించాలని డీఆర్వో, సర్వే ఏడీని కలెక్టర్ ఆదేశించారు.

ఎడారీకరణ నివారణపై అధ్యయనం

రాజస్థాన్‌కు డ్వామా అధికారుల బృందం
రేపట్నుంచి నాలుగు రోజుల పర్యటన

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎడారీకరణ నివారణపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డ్వామా పీడీ సలీం బాషా నేతృత్వంలోని బృందం రాజస్థాన్‌కు వెళ్లనుంది. ఈనెల 4నుంచి రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఆ ప్రాంతంలోని ఎడారి పరిసర ప్రాంతాల్లో డ్వామా పీడీ సలీంబాషా, కణేకల్ ఏపీఓ సుధాకర్, బొమ్మనహాళ్ ఈసీ రాజేష్, దర్గాహొన్నూరు గ్రామ రైతు ముక్కన్న, కణేకల్లు మండలం నాగేపల్లి రైతు వెంకటేష్ నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. ఎడారీకరణ నివారణకు అక్కడ తీసుకుంటున్న చర్యలు, ఉపాధి పథకం అమలు చేస్తున్న తీరు, సాగుచేస్తున్న పంటలు, నీటి నిల్వ తదితరాలను పరిశీలించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

సెలవులో హౌసింగ్ పీడీ

ఇన్‌చార్జిగా పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కంటి శస్త్రచికిత్స కోసం 15రోజుల పాటు హౌసింగ్ పీడీ శైలజ సెలవులో వెళ్లనున్నారు. దీంతో పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాంకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదట పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్ అస్లాం హౌసింగ్ పీడీగా అదనపు బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత చూపారు. కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు జహీర్‌అస్లాం అంగీకరించారు. గురువారం హౌసింగ్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

89 మంది కానిస్టేబుళ్ల బదిలీ


కానిస్టేబుళ్ల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీలు నిర్వహించారు. పారదర్శకత, నిబంధనలే ప్రామాణికాలుగా తీసుకుని సీనియార్టీ ఆధారంగా సిబ్బంది కోరుకున్న చోటుకే స్థాన చలనం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ జగదీష్ తన చాంబర్లో 89 మంది కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది జాబితాను సిద్ధం చేసి కౌన్సెలింగ్‌కు పిలిచారు. పట్టణాల్లో పనిచేస్తున్న వారిని రూరల్ పోలీస్‌స్టేషన్లకు, రూరల్ ప్రాంతాల వారిని పట్టణ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ రవిరాంనాయక్, పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, హరినాథ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

త్వరలో సంచార పశు ఆరోగ్య సేవల పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సంచార పశు వైద్య సేవలు త్వరలో తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌కు కాంట్రాక్టును అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 సంవత్సరంలో తొలి విడత కింద జిల్లా వ్యాప్తంగా ఏడు పశు సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. అప్పట్లో జీవీకే సంస్థకు సంచార వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి మూడో వారంతో ఆ సంస్థతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం పూర్తి కావడంతో తొలి విడతలో మొదలు పెట్టిన ఏడు పశు సంచార వాహనాలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో 'సంచార పశు వైద్యసేవలు బంద్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు తిరిగి భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిలెడ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా సంచార పశు వైద్యసేవల కాంట్రాక్టును అప్పగించింది. ఈ నేపథ్యంలో త్వరలో జిల్లాలో సంచార పశువైద్య సేవలు తిరిగి ప్రారంభం కానున్నట్లు పశుసంవర్ధక శాఖాధికారులు పేర్కొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ

శింగనమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజలాలపురం ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టె నిర్మాణానికి టీడీపీ నాయకులు, అధికారులు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుంజయ్య, కుళ్ళాయప్ప, పెద్దన్న, లింగమయ్య, రామాంజి, ఓబుళపతి, వెంకటరమణ, ఎర్రస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సు పోస్టర్ల విడుదల

శింగనమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 8న నిర్వహించే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ కోరారు. శింగనమలలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. సదస్సు ఈనెల 8న అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మధుయాదవ్, నేసే మధు, నారప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వెంటనే కాలనీకి నీరు

● ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ వెల్లడి

శింగనమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని శివపురం ఎస్సీ కాలనీకి విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వెంటనే కాలనీకి నీటి సమస్య లేకుండా చేస్తామని ఎంపీడీఓ భాస్కర్, ఆర్ డబ్ల్యూఎస్ మండల జేఈఈ రవీంద్రరెడ్డి తెలిపారు. 'బోరు, మోటారు ఉన్నా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం' అనే కథనం బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ శివపురం సందర్శించారు. చక్రాయపేట పంచాయతీకి సంబంధించి విద్యుత్ కనెక్షన్ కోసం రూ. 1. 84 లక్షలను మూడు రోజుల కిందట విద్యుత్ శాఖకు పంపామన్నారు. ఆ శాఖాధికారి అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం ఆలస్యం అవుతోందని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన మహేష్, ఆనంద్, ప్రకాష్ నాయక్, మహేంద్ర, రుక్సాన, మహిత, సిరివల్లి, నిశ్చితను బుధవారం ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, ఫిజికల్ ఎడ్యు కేషన్ డైరెక్టర్ రాంబాబు అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు.

శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మూడోరోడ్డు శ్రీరామనవమి ఉత్సవ సమితి నూతన కమిటీని ఎంపికచేశారు. స్థానిక ఎస్ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా వెంకటేశులు, సభ్యులుగా వెంకటేష్, వీఎం శ్రీనివాసులు, వీఎం రమేష్, పుల్లన్న, రాము, సత్యమయ్య, బాలరాజు, చంద్రశేఖర్, వెంకటరాముడు, ప్రకాష్, వెంకటేశులును ఎన్నుకున్నారు. ఈనెల 6న నిర్వహించే ఉట్లమాను ఉత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠం గా రూ.28వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.6,500, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 354 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో ప్రకృతి వైపరీత్యాలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్నాయని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం కురుగుంట గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్న సూర్యప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్ పరిధిలో సరస్వతీ నగర్‌లో నివాసముంటున్న సూర్యప్రతాప్‌రెడ్డి నగరంలోని రంగ మెడికల్స్‌లో పనిచేస్తున్నాడు. తాజాగా ఓ భూమి విషయంలో రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిళ్లు వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కారు, బైకు ఢీ... ఒకరికి గాయాలు

శింగనమల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మరువకొమ్మ క్రాస్ వద్ద కారు, బైక్ ఢీకొనడంతో సోదనపల్లికి చెందిన టీడీపీ నాయకుడు అట్టే రామాంజినేయులు గాయపడ్డారు. ఆయన బుధవారం ఉదయం ద్విచక్రవాహనంలో అనంతపురానికి సొంత పని మీద వెళుతు న్నాడు. మరువకొమ్మ క్రాస్ వద్ద జాతీయ రహదారి ఎక్కుతుండగా అనంతపురం నుంచి తాడిపత్రికి వెళుతున్న కారు బైక్ ఢీకొంది. దీంతో రామాంజినేయులు గాయపడ్డాడు. శింగనమల ఎస్ఐ విజయ్‌కూమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రాలు సమర్పించారు. మొత్తం 40 అర్జీలు రాగా అందులో ముఖ్యంగా భూ సమస్యలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉద్యోగుల సమస్యలు, పింఛన్లు, రోడ్ల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మన్నీల ఎస్సీ కాలనీలో తాగు నీటి కోసం బోరు వేయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానిక నాయకులు చొరవ తీసుకొని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. కుటుంబ సాధికార సారథిలో ప్రతి ఒక్కరూ ఉండేలా చూసుకోవాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 83వేలకుపైగా సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాలో రెండో స్థానంలో నిలిచామన్నారు. ఇప్పటికే 73వేల సభ్యత్వాల కార్డులు వచ్చాయని, వాటిని శ్రీరామనవమిలోగా అందరికీ అందజేయాలన్నారు. అనంతరం శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజినప్ప చేతుల మీదుగా ఎమ్మెల్యే సభ్యత్వ కార్డును తీసుకున్నారు. నియోజకవర్గంలో ఇప్పటిదాకా ఎనిమిది మంది మరణించిగా, వారికి ఇన్సూరెన్స్ వచ్చిందన్నారు. త్వరలో కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు వస్తాయన్నారు. వైసీపీ హయాంలో తొలగించిన వాటిని తిరిగి పునరుద్ధరిస్తామని ఆమె స్పష్టం చేశారు.

పార్టీలకు అతీతంగా సమస్యలు పరిష్కరిస్తాం

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సమస్యలు పరిష్కరిస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఆర్డీఓ కేశవనాయుడు ముఖ్య అతిథులుగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులు తీసుకున్నారు. వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఎమ్మెల్యే మాట్లాడుతూ..... మాట్లాడుతూ... వైసీపీ హయంలో చేపట్టిన భూ రీసర్వేలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాటిని పరిష్కరిస్తామన్నారు. అప్పటి అవినీతి అక్రమాలపై త్వరలోనే విచారణ జరుపుతామన్నారు. జగనన్న కాలనీల పేరుతో అనువుకానీ చోట ఇళ్ల కోసం స్థలాలు కొనుగోలు చేసి ప్రభుత్వ సొమ్మును కాజేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చాలామంది అనర్హులు నకిలీ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. త్వరలోనే వాటిని తొలగిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, డీసీ చైర్మన్ శేఖర్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంఈఓలు తారా చంద్రానాయక్, మల్లికార్జునాయక్, ఏఓ సోమశేఖర్, ఏపీఎం మల్లికార్జున, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌బాస్కర్, మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, నాయకులు పాండు, గుత్తా బాలకృష్ణ, చల్లా నాగరాజు, ఎంపీటీసీ విశ్వనాథ్, సుంకన్న, శీనప్ప, ఓబిరెడ్డి, రమణప్ప, నరసింహారెడ్డి, చితంబరప్ప, బాబయ్య, గుత్తాహరి, సామాల మధు, వెంకటేశు, ఎర్రిస్వామి, సుబ్బు, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు రోడ్లు నిర్మించాలి

● గార్లదిన్నె: మండల పరిధిలోని కొప్పలకొండ, కమలాపురం సమీపంలో కొండపై వెలసిన అక్కమ్మ దేవాలయానికి రోడ్డు నిర్మించాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి విన్నవించారు. మాజీ ఎంపీటీసీలు శీనప్ప, వెంకట్రాముడు రమణప్ప, సామాల మధు తదితర నాయకులు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేని కోరారు. అలాగే కొప్పలకొండలో శ్మశాన వాటికికి దారి ఏర్పా టు చేయాలన్నారు. కల్లూరు అంజినేయ స్వామి దేవాలయానికి రోడ్డు, స్టేట్ బ్యాంకు సమీపంలో డ్రైనేజీ, హైవే నుంచి ఎగువపల్లికి పోయే దారి ఏ ర్పాటు చేయాలని కోరారు.

టీడీపీ అర్బన్ కార్యాలయంలో ప్రజాదర్బార్



అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదేశాల మేరకు అర్బన్ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వ హించారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, వీఎల్ఎన్ మూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు కాలనీల్లోని డ్రైనేజీ సమస్యలు, టిడ్కో ఇళ్ల, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలపై స్థానికులు అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్పొరేటర్ బాలాంజినేయులు, నాయకులు సైఫుద్దీన్, గోళ్ల సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, వడ్డే భవానీ, కంఠా దేవి తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ మంత్రిని కలిసిన ఆర్టీసీ జోనల్ చైర్మన్



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన పూల నాగరాజు తదితరులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు రవాణాశాఖ మంత్రిని కలిశారు. ఆయనతో పాటు విజయవాడ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి బుధ వారం విజయవాడలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలు, ప్రజారవాణా అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రితో చర్చించినట్లు పూల నాగరాజు తెలిపారు.

బోర్లకు మరమ్మతులు చేయించండి: కమిషనర్

అనంతపురం క్రైం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో రిపేరులో ఉన్న బోర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని నగర కమిషనర్ బాలస్వామి అధికారులను ఆదేశించారు బుధవారం నగరంలోని పవర్ బోర్స్, హ్యాండ్‌బోర్స్(చేతి పంపులను) కమిషనర్ పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ఆయన ముందస్తుగా నగర వీధుల్లోని బోర్లను పరిశీలిం చారు. ఆసార్‌వీధి, మున్నానగర్, పాతూరులోని బోర్ల పనితీరుపై ఆరా తీశారు. మొత్తం 199 పవర్‌బోర్స్ ఉండగా, వాటిలో 185 పనిచేస్తున్నాయని, మిగిలిన 14బోర్లను మరమ్మతు చేయించాలని ఇంజీర్లను ఆదేశించారు. 224 హ్యాండ్‌బోర్లలో 214 పనిచేస్తుండగా మిగిలిన వాటిని బాగు చేయించాలన్నారు. అనంతరం గుత్తిరోడ్డులోని అన్న క్యాంటీన్‌లో అల్పాహారం పంపిణీని పరిశీలించారు.

సమస్యలను పరిష్కరించాలి

● సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దాదాపు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక సివిల్ సప్లయ్ శాఖ మంత్రి మనోహర్ స్పందించి కూలీ రేట్లు క్వింటాకు రూ. 25 నుంచి రూ. 28కి పెంచుతూ జీఓ జారీచేయడం శుభపరిణామమన్నారు. అలాగే హమాలీల పెండింగ్ సమస్యలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలి

● ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రతనిచ్చే 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ ఏ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం డిపో గేట్ వద్ద ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ... ఆర్టీసీ సిబ్బంది తప్పులు చేస్తే పనిష్మెంట్ల విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను ఆ సర్క్యులర్ ద్వారా అమలులోకి తెచ్చారని అన్నారు. అయితే 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక అప్పటి వైసీపీ పాలనలో సర్క్యులర్‌ను పక్కన పెట్టేసి, సిబ్బందిపై ఇష్టా రాజ్యంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా నాయకుడు పుల్లయ్య, డిపో కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రాము, ప్రసాద్, శ్రీరాములు, శ్రీనివాసులు, మద్దిలేటి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతిని విజయవంతం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాధిక బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 5న సప్తగిరి సర్కిల్‌లోని చర్చి ఎదుట ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళుర్పిస్తామ న్నారు. అనంతరం జడ్పీలో 10.30కు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

తూకాల్లో తేడాలు.. ఆగ్రహించిన రైతులు



వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

కనగానపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ఉంది రైతుల పరిస్థితి. అసలే పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయిన రైతులను వ్యాపారులు తూకాల్లో మరింత మోసం చేస్తున్నారు. మండలపరిధిలోని తగరకుంట గ్రా మానికి చెందిన వేరుశనగ వ్యాపారి శ్రీనివాసరెడ్డి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతుల నుంచి వేరుశనగ కాయలు కొనుగోలు చేశాడు. మామిళ్ళపల్లిలో రైతు వై.నారాయణరెడ్డి పండించిన వేరుశనగ కాయలను బస్తా 46 కేజీలు చొప్పున రూ. 2730 మాట్లాడుకున్నారు. బస్తాలను తూకం వేసి ఐషర్ వాహనంలో వేస్తుండగా అనుమానం వచ్చిన రైతులు బస్తాలను మరొక్కసారి తూకం వేయాలని వ్యాపారితో వాగ్వాదం చేశారు. బస్తాలను మళ్లీ తూకాలు వేయగా ఒక్కో బస్తా 50 నుంచి 52 కేజీలు తూకం రావడంతో వ్యాపారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనున్న రైతులు సర్దిచెప్పి వివాదం సద్దుమనిగింది. దళారులు, వ్యాపారులు రైతులను నిండా మోసం చేస్తున్నారని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

● యూజేఏసీ నాయకుల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న యూజేఏసీ నాయకులు, ముస్లింలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు-2024ను వెంటనే ఉపసంహరించుకోవాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ(యూజేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం యూజేఏసీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు నలబ్యాడ్జీలు ధరించి క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమానికి మేయర్ వసీం, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ, వైసీపీ నాయకుడు నదీం అహ్మద్, కాగజ్ ఘర్ రిజ్వాన్, ఏకేఎస్ ఫయాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రకారం ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా నమ్మిన మతాన్ని స్వీకరించి, ఆచరించే హక్కు ఉందన్నారు. ఆర్టికల్ 26 ప్రకారం ధార్మిక కార్యకలాపాల కోసం మతశాఖలను స్థాపించుకుని నిర్వహించుకునే హక్కు ఉందన్నారు. వక్ఫ్ ఆస్తులపై వివాదం వస్తే పరిష్కరించేందుకు హైకోర్టు న్యాయమూర్తి నియమించిన ట్రిబ్యునల్ ఉందన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన బిల్లులో కలెక్టర్లకు అధికారమిచ్చారని అన్నారు. దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను క్రమబద్ధీకరణ చేసే కుట్రలు కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఖాజా హుస్సేన్, అల్లీపీరా, మహబూబ్‌బాషా, వలి, రామిరెడ్డి, టిప్పుసుల్తాన్ జాకీర్, ముక్తియార్, నారాయణస్వామి, ఇమామ్, రాజేష్‌గౌడ్, రాజు మతపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా సల్లాపురమ్మ జాతర



సల్లాపురమ్మ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లిలో సల్లాపురమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ని ప్రత్యేకంగా అలంకరించి, ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు చేశారు. పొట్టేళ్లు, మేకలు, కోళ్లను అధిక సంఖ్యలో అమ్మవారికి బలి ఇచ్చారు. సల్లాపురమ్మ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. జా తరకు జిల్లా నలు మూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివ చ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుందేలు పార్వేట కార్యక్రమం నిర్వహించారు. ఆ కుందేలును పట్టుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. జాతర సందర్భంగా రాప్తాడు సీఐ శ్రీ హర్ష పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

తిక్కయ్యస్వామి ఉట్ల పరుష



అలంకరణలో తిక్కయ్యస్వామి మూలవిరాట్

నార్పల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తిక్కయ్యస్వామి ఉట్ల పరుషను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన టెంకాయ పగలగొట్టే పోటీల్లో చిలమకూరి అశోక్ అనే వ్యక్తి రూ.1,116 గెలుచుకున్నాడు. అనంతరం ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. చివరకు చిలమకూరి రామకృష్ణ ఉట్లమాను ఎక్కి రూ.2,116 గెలుచుకున్నాడు. అలాగే ఉట్ల పరుషలో గాజులు, స్వీట్ల అంగళ్ల వద్ద మహిళల సందడి కనిపించింది. టీడీపీ జిల్లా నాయకుడు అలం వెంకటనరసానాయుడు, మండల నాయకులు ఆకుల విజయ్‌కుమార్, బాబు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు, పులిహోరను ఉచితంగా అందజేశారు. ఎస్ఐ సాగర్ గట్టిపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

వ్యాధినిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

●ల్యాబ్ టెక్నీషియన్లకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్యం అందించాలంటే ల్యాబ్ రిపోర్టులే అత్యంత కీలకమని, అలాంటి ల్యాబ్ పరీక్షలను పక్కాగా నిర్వహించి రిపోర్టులు సకాలంలో అందించాలని ల్యాబ్ టెక్నీషియన్లకు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి సూచించారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలో 63రకాల ల్యాబ్‌పరీక్షలు నిర్వహించడానికి అవకాశం ఉందన్నారు. అయితే డాక్టర్ల సలహాలమేరకు సూచించిన రోగాలను నాణ్యమైన పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయినపుడే రోగికి డాక్టర్లు అవసరమైన చికిత్సలు అందించి వ్యాధిని నయంచేస్తారన్నారు. అందుకే ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టరు ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో ఖాళీ కుర్చీలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని కేవలం గంటలోపే మమ అనిపించారు. ఒక్క మాటలో చెప్పాలంటే వచ్చామా... వెళ్లామా... అన్న రీతిలో జరిగింది. పలువురు ప్రజాప్రతినిదులతో పాటు పలు ప్రధాన శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో హాజరైన సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమైన అధికారులే రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. వచ్చే సమావేశానికైన ఇలాజరగకుండా చూడాలని కోరారు. పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై వేసవిని దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అయితే వివిద శాఖలకు సంబంధించి అధికారులు వివరించిన ప్రగతి నివేదికలపై ఎలాంటి చర్చ లేకపోవడంతో సమావేశం సాదాసీదాగా ముగిసింది. సమావేశంలో ఎంపీపీ అంజలి, జడ్పీటీసీ గోవిందరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్ నాయక్, ఏఓ ఉదయ్‌కుమార్, ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఏపీఓ నారాయణస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బేతాపల్లిలో వైభవంగా ఊరిదేవర


బేతాపల్లిలో ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

గుత్తిరూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ అమ్మవారి ఊరి దేవరను వైభవంగా నిర్వహించారు. వేకువజామున పూజారులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. గ్రామస్థులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు. ప్రతి ఇంటికి బంధుమిత్రులు పెద్దఎత్తున రావడంతో గ్రామం కిటకిటలాడింది. పెద్దమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్, టీడీపీ నేతలు కెసి హరి, హరినాథ్ గౌడ్, మండల కన్వీనర్, బర్ధీవలి దర్శించుకుని పూజలు చేయించారు.

రంగచేడులో మారెమ్మ జాతర

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడులో మారెమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిపించారు. మంగళవారం అమ్మవారి ఉత్సవమూర్తిని గంగస్నానానికి తీసుకెళ్లి ప్రత్యేకపూజలు జరిపి అర్ధరాత్రి స్థానిక ఆలయానికి చేర్చారు. అనంతరం జాతర ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సిడిమాను ఉత్సవం


సిడి మాను ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో సిద్ధుల కొండపై వెలసిన రససిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద సిడి మానోత్సవాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలో స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం సిడిమానుకు పూజారిని కట్టి మూడుసార్లు గోవింద నామస్మరణతో తిప్పారు. పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు.

పంచలోహ విగ్రహాల సమర్పణ

కణేకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి పంచలోహ ఉత్సవ విగ్రహాలను భక్తులు సమర్పించారు. స్థానికుడైన పెద్ద నరసింహులు కుటుంబ సభ్యులతో కలిసి సుమారు రూ.లక్ష విలువ చేసే సీతారాముల సమేత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను బుధవారం అర్చకుడు విజ్జిస్వామికి అందజేశారు. అనంతరం ఆలయంలో స్వామిని దర్శించి పూజలు చేయించారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

బెళుగుప్ప, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అసమానతలు లేకుండా ప్రతి పేద లబ్ధిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ వసంతబాబు గ్రామకార్యదర్శులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వే నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం 13 సర్వేలు నిర్వహిస్తోందని, వాటిని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశిస్తూ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. తహసీల్దార్ షర్మిల, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఈవోఆర్డీ నాగేశ్వరశాస్త్రి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరసముద్రం సచివాలయాన్ని ఎంపీడీఓ నందకిషోర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ సర్వేలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

యాదవ ఫెడరేషన్ డైరెక్టర్‌గా మస్తాన్ యాదవ్

గుంతకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): యాదవ ఫెడరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కే.అచ్చెన్నాయుడు నేతృత్వంలో రాష్ట్ర యాదవ ఫెడరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం జరిగింది. ఇందులో ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ ఫెడరేషన్ డైరెకర్‌గా ప్రమాణంచేశారు. అనంతరం పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో గల హుండీ ల కానుకల్ని బుధవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణలో ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పద్మావతి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ ఆధ్వర్యంలో లెక్కింపు చేశారు. ఐదు రోజుల పాటు సాగిన జాతరలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించగా.. రూ. 3,35,625ల ఆదాయం చేకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్‌పర్సన్ తెలిపారు. దీంతోపాటు 70 వెండి గొడుగులు, రెండు వెండి అమ్మవారి రూపాలు, మూడు నాగపడగలు, నాలుగు ఉయ్యాలలతో పాటు మరికొన్ని వెండి ఆభరణాలను భక్తులు సమర్పించినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వే డీజిల్ షెడ్ పరిశీలన

గుత్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్దగల పలు విభాగాలను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ ప్రిన్సిపాల్, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదన్‌రావు బుధవారం పరిశీలించారు. ముందుగా అక్కడి గౌతమేశ్వర ఆలయాన్ని , షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గ్యారేజ్ వర్క్‌షాప్‌లో పర్యటించి మెగా స్టోర్‌ను ప్రారంభించారు. తర్వాత యార్డులో పర్యటించి రైల్వే డీజిల్ షెడ్‌లో రైలు ఇంజన్ల మరమ్మతులను, రైల్వే ఇనిస్టిట్యూట్‌ను పరిశీలించారు. సమస్యలపై రైల్వే కార్మికుల సంఘాల నాయకులు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. సీఅండ్‌డబ్ల్యూ సీనియర్ డీఎంఈ మణికుమార్, డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లులో సోమవారం అర్ధరాత్రి తలారి వన్నూరుస్వామి ఇంట్లో అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తి రెండు సార్లు చొరబడి నగదును దోచుకెళ్లాడని బాధితులు ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ఇంకోసారి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పోలీసులు వెంటనే గ్రామంలో విచారణ చేపట్టారు. బాధితురాలు అనంతమ్మ ఫిర్యాదు మేరకు రూ. 50 వేల నగదు చోరీ అయినట్లు కేసు నమోదు చేశామని తెలిపారు. దీనిపై విచారించి నిందితుడిని పట్టుకుంటామని అన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 20 మంది లబ్ధిదారులకు రూ. 18,44,357 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు అనంతపురంలోని రామ్‌నగర్‌లో గల తన నివాసంలో బుధవారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న బాధితులకు ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు వేల్పుల శ్రీనివాసులు, గోవిం దు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- నూతిమడుగులో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ


పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కంబదూరు మండలం నూతిమడుగులో రూ.1.94 కోట్ల అంచనాతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం ఆస్పత్రి నిర్మాణానికి 1.22 ఎకరాల భూమిని దానం చేసిన మాజీ మంత్రి పీవీ చౌదరి మనవడు డాక్టర్ పీవీ ఆదిశేషును, కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కూడా కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, మాజీ ఎంపీపీ దండా వెంకటేశులు, మాజీ వైస్ ఎంపీపీ తలారి ఎర్రిస్వామి, టీడీపీ మండల కన్వీనర్ కే.శివన్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ లింగా సురేంద్ర, నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరో రెండేళ్లల్లో వైసీపీ కనుమరుగు

పట్టణంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ కోసం కష్ట పడ్డ ఏ ఒక్క కార్యకర్తను విస్మరించ కూడదన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లోను 60 మందికి ఇద్దరు సాధికార మిత్రలను ఎంపిక చేయాలన్నారు. సాధికార మిత్రల ఎంపిక చేయడంలో అందరికీ న్యాయం చేసే విధంగా ఉండాలన్నా రు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించి, సాధికార మిత్రలను ఎంపిక చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థిక సాయం

పట్టణంలో గత వారం రోజులుగా జరిగిన అక్కమాంబ జాతరలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన ఉరుముల కళాకారులను ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారందరినీ ప్రోత్సహిస్తూ రూ. లక్ష నగదును అందజేసి అభినందించారు. వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, అక్కమాంబ ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పద్మావతి పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి


జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి కలిసి నియోజకవర్గంలోని తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు తదితర సమస్యలను తెలియజేశారు. ముఖ్యంగా వేసవికాలం ప్రారంభమైన తరుణంలో నియోజకవర్గంలో ఎక్కడా కూడా తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అభివృద్ధి, నిధుల మంజూరు తదితర అంశాలపై చర్చించారు.

సమస్యలను పరిష్కరించాలి: ఎన్‌ఎంయూ


రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఉరవకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం తెల్లవారుజామున ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకుడు ఎర్రిస్వామి మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. 2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్‌లు, తొలగింపులను ఆపాలన్నారు. 114 జీఓలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ. 150 నుంచి రూ. 400 ల వరకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణకు సెలవులు మంజూరు చేయాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూఏ డిపో కార్యదర్శి హెచ్ తిప్పేస్వామి , గ్యారేజీ కార్యదర్శి సతీష్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ హెచ్ రమేష్, పబ్లిసిటీ సెక్రెటరీ నఫీస్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బస్సులు నడపాలి

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని పట్టణంలోని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ .. గుంతకల్లు జంక్షన్ నుంచి విజయవాడకు వెళ్లేందుకు సాయంత్రం ఒకటి, రాత్రి ఒకటి మాత్రమే రైళ్లు ఉన్నాయన్నారు. అవి దొరక్క పోతే.. ఇక ఆ రోజుకు విజయవాడకు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక బస్సు సర్వీసులు నడపాలని కోరారు. అలాగే శ్రీశైలం, హైదరాబాద్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బేతంచెర్లకు బస్సులు నడపాలన్నారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో యువత ముందు ఉండాలని పట్టణంలోని శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ గోపాల్ సూచించారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాల్లో క్యూలైన్ బాధ్యతలు చేపట్టిన కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడేట్లను బుధవారం ఆయన అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆలయంలో ఎన్‌సీసీ కేడెట్ల సేవలు మెచ్చి ఆలయ అధికారులు, పోలీస్ శాఖ ప్రశంసా ధృవ పత్రాలను అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రకాష్, లాస్య, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులను ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అభినందించారు. ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలువ నీటి సమస్యపై ఘర్షణ

పెద్దవడుగూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం చిన్నవడుగూరు గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ నాయకులు పొలానికి కాలువ నీటి విషయంపై ఘర్షణ పడ్డారు. చిన్నవడుగూరుకు చెందిన భూషణ, దివాకర్ అనే రైతుల మధ్య పొలానికి వెళ్లే కాలువనీటిపై వివిదం నడుస్తోంది. ఇరుపార్టీల నాయకులు తహసీల్దార్ సమక్షంలో పరిష్కరించేందుకు చర్చలు జరుపుతుండగా వైసీపీకి చెందిన వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో టీడీపీ వారు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ క్రమంలో ఇరుపార్టీల వారి మధ్య ఘర్షణ చోటుచేసుంది. తహసీల్దార్ వారిని శాంతిపజేసి సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు మీ మాటే ముఖ్యం

తాడిపత్రి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ప్రజా సమస్యలపై గురువారం మీ మాటే ముఖ్యం అనే కార్యక్రమం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో జరగనుంది. పోలీస్ స్టేషన్ పరిధిలోనిప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే ఫిర్యాదుల రూపంలో అందజేయాలని పోలీసులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

మత్స్యకారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పెద్దపప్పూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వరదయ్యపల్లికి చెందిన గంగపుత్ర మత్స్యకారుల సంఘం ఎన్నికను బుధవారం అధికారులు ఏకగ్రీవం చేశారు. సంఘం అధ్యక్షుడిగా రోద్దు వెంకటేశు, ఉపాధ్యక్షుడిగా పీ. వెంకటేశు, కార్యదర్శిగా ఆంజనేయులుతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. మత్స్యకారుల సంఘం ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ, అధికారి వైష్ణవి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు

బెళుగుప్ప, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతోపాటు తండాలో గల నాటుసారా తయారీ స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. తండాలో రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా బెళుగుప్పలో ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 920 లీటర్ల ఊటను, తయారీ సామగ్రిని ధ్వంసం చేశామన్నారు. నలుగురు తయారీదారులు పరారీలో వున్నారన్నారు. వీరిని గతంలో తయారీదారులుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. సీఐలు అన్నపూర్ణ, హసీనాబాను పాల్గొన్నారన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కరాటే శిక్షణ


కరాటేలో భాగంగా చేత్తో పెంకులను పగుల కొడుతున్న విద్యార్థినులు

విడపనకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు బుధవారం కరాటేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ గోపాల్ మట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని స్వీయ రక్షణ కోసం కరాటే లాంటివి నేర్చుకోవాలన్నారు. ఆపద వచ్చిన సమయంలో తనను తాను ఎలా రక్షించుకోవాలో మెలకువలు వివరించారు. కరాటేలోని వివిధ రకాల టెక్నిక్‌లను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. తర్వాతపలువురు బాలికలు ప్రతిభ చూపారు. కేజీబీవీ ఎస్‌ఓ తులసిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

పుట్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి ఈ నెల11వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం తక్కళ్లపల్లి, 4వతేదీన కడవకల్లు, 5న పుట్లూరు, కడవకల్లు, 8, 9 వ తేదీల్లో కోమటికుంట్ల, అరకటవేముల, 10, 11న ఎస్. వెంగన్నపల్లి, అరకటవేముల సచివాలయాల్లో నిర్వహిస్తామని అన్నారు. ఆధార్‌నమోదు, పేర్లు మార్పు, తప్పు ఒప్పులను సరిచేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శెట్టూరు: మండలంలోని యాటకల్లు సచివాలయంలో గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటలకు ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామారావు ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆరేళ్ల లోపు వయసు గల పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవచ్చన్నారు.

6న తిరుణాల

పుట్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రంగమనాయునిపల్లిలో ఈనెల 6వతేదీన సీతారామాంజనేయస్వామి తిరుణాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యా ణం జరుగుతుందన్నారు. తర్వాత రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పా రు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రేపు గ్రామసభలు

యాడికి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 950 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం చింతలాయపల్లి- కుందనకోట గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌పై ఈనెల 4వ తేదీన గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కుందనకోటలోని రచ్చకట్టవద్ద, చింతలాయపల్లి లోని చౌడేశ్వరి ఆలయం వద్ద గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటికి గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు. గ్రామస్థులు హాజరై అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు.

శాంతిర్యాలీ

యాడికి, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నివాళులర్పిస్తూ మండలకేంద్రంలో బుధవారం మండల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రవీణ్ పగడాల చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రధానవీధుల గుం డా శాంతి ర్యాలీ చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొళగానహళ్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున రూ. 15 వేలు విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం ఆయన నగదు అందించారు.

స్టాక్‌పాయింట్ తనిఖీ

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో గల చౌక ధాన్యపు స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆర్డీఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. బియ్యం, నిత్యావసర సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, సీఎస్ డీటీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) :మండలంలోని బసినేపల్లి గ్రామశివారులోని రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన రామాంజునేయులు బైక్‌లో పత్తికొండ వైపు వెళ్తుండగా గ్రామశివారులో వెనుక నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుతాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రజాపురం వద్ద ఇద్దరికి..

గుత్తిరూరల్: రజాపురం శివారులోని 67వ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గుంతకల్లుకు చెందిన శ్యామ్, ఈరన్న బైక్‌లో గుత్తికి వస్తుండగా రజాపురం శివారులో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజాఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ప్రజలు వివిధ సమస్యలపై అందజేసిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వాటిని నిశితంగా పరిశీలించి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులను ఆదేశించారు. తర్వాత మాట్లాడుతూ.. ప్రజలు బాగుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉం డేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరికీ సమన్యాయం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అభ్యర్థులను ప్రకటించిన తరువాత నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా గెలుపునకు కృషి చేయాలని సూచించారు. టీడీపీ గుత్తిఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, నాయకురాలు పత్తిహిమబిందు, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ప్రభుత్వ ఆసుపత్రి అడ్వైజర్ కమిటీ సభ్యులు చికెన్ శీన, ఎర్రగుడి రమేష్, న్యాయవాది సోమశేఖర్, గాంధీనగర్ సర్పంచు లింగమయ్య, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోగల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు బుధవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంజనేయస్వామి ఆలయానికి ఉన్న తాళాలను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి హుండీని ఎత్తుకెళ్లారు. అందులో దాదాపు రూ. 1.30 లక్షల వరకు ఉండొచ్చని తెలిపారు. ఆయంలో నాలుగేళ్ల క్రితం ఒక సారి, మూడునెలల క్రితం ఒకసారి చోరీ జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు జరగడం బాధాకరమన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సాయిబాబా ఆలయంలో..

యాడికి: మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజా సామగ్రి చోరీ అయిన సంఘటనపై బుధవారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం పూజ అనంతరం రామాంజనేయులు అనే వ్యక్తి ఆలయంలోకి వెళ్లి పూజా సామగ్రి, హారతి పళ్లెం, ప్రసాద వితరణగిన్నె తదితర వస్తువులను ఎత్తుకెళ్లాడు. ఆలయ కమిటీ సభ్యుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

మారెమ్మ ఆలయంలో..

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రంలో గల మారెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారని, అక్కడ హుండీ పగులగొట్టి నగదును దోచుకెళ్లారని గ్రామస్థులు తెలిపారు. బుధవారం పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలాల్లో విద్యుత్ వైర్లు..

గుంతకల్లుటౌన్: మండలంలోని నక్కనదొడ్డి తండాలో ఎనిమిది మంది రైతుల పొలాల్లోని మోటార్లకు చెందిన విద్యుత్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. మోటార్లకు చెందిన రాగి తీగలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందన్నారు. రూరల్‌పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

బొమ్మనహాళ్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగదహాళ్ గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగదహాళ్‌కు చెందిన బోయ అనంతమ్మ(38) గత కాలం నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. పలు చోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. కొద్దిసేపటి తర్వాత కుటుంబసభ్యులు గమనించి వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త వన్నూరుస్వామి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నట్లు చెప్పారు.

హార్టికల్చర్ సదస్సును విజయవంతం చేయండి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 8వ తేదీన జరిగే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున కోరారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఉద్యాన రైతుల సమస్యలను చర్చించేందుకు నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రైతులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు క్రాంతిష్, ఏపీ రైతు సంఘం తాలూకా, అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్న ఘనత కేశవ్‌దే: టీడీపీ

బెళుగుప్ప, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కరువుతో అల్లాడుతున్న మండల రైతులను ఆదుకున్న ఘనత రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌దేనని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో రబీ పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులు అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేశవ్ మంత్రి అయ్యాక బెళుగుప్ప మండలాన్ని కరువు కింద ప్రకటించడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 36వ ప్యాకేజీ కింద 450 ఎకరాలకు సాగునీరందించడానికి రూ. 45 కోట్లు మంజూరు చేయించారన్నారు. కాలువ కింద భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం ఇప్పించారని పేర్కొన్నారు. అలాగే జీడిపల్లికి ఆర్‌అండ్‌ఆర్ మంజూరు చేయించారని తెలిపారు. ఇన్ని చేసిన కేశవ్‌కు మండల రైతులందరూ రుణపడి వుంటామని కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి

రాయదుర్గం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని పట్టణంలోని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బళ్లారిరోడ్డులో ఉన్న జామియా మసీదు చౌక్ నుంచి వినాయకసర్కిల్, బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతిర్యాలీని నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఖాజీ సైపుల్లా, లాయర్ అబ్దుల్ వాహబ్, మజీద్, బ్రెడ్‌సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు